
సాక్షి ఒడిశా

ఆదివారం । 27 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,73,255లు, బంగారం 1 గ్రాము 100 మిల్లీగ్రాములు, వెండి 20 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సీఎస్ఆర్‌తో ప్రయోజనాత్మక పనులు చేపట్టాలి

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమం కింద ప్రయోజనాత్మక పనులు చేపట్టాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి సూచించారు.

- 8లో ▸



భూముల రిజిస్ట్రేషన్‌లో భారీగా అవినీతి

గజపతి జిల్లా గుసాని సమితి కత్తలకవిటి పంచాయతీ డాక్టర్ బంజరి గ్రామంలోని 42 ఎకరాల భూమి అమ్మకం వివాదంలో పలువురి హస్తం ఉందని మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఆరోపించారు.

- 8లో ▸

న్యూస్‌రీల్

నల్లరాళ్లను తరలిస్తున్న లారీలు స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న లారీలు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమీపంలో ఉన్న కంతొబాలి ప్రాంతంలో కొండను ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వి, నల్లరాళ్లను తరలిస్తున్న మూడు లారీలను జిల్లా గనుల శాఖ అధికారులు దాడులను నిర్వహించి శుక్రవారం పట్టుకున్నారు. గత కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో నల్లరాళ్లను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గనుల(మైన్స్) శాఖ అధికారులు, మునిగుడ పోలీసులు, తహసీల్దార్ కలిసి కంతొబాలి ప్రాంతంలో ఆకస్మిక దాడులను నిర్వహించారు. కంతొబాలి ప్రాంతంలో గల కొండలను తవ్వి నల్లరాళ్లను లోడింగ్ చేసి ఉన్న రెండు లారీలు, అదేవిధంగా లోడింగ్‌కు సిద్ధంగా ఉన్నటువంటి మరో లారీని పట్టుకొని మునిగుడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు వాహనదారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొంచుగుడకు వైద్య బృందం



గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ స్వయి

రాయగడ: కొద్దిరోజుల క్రితం జిల్లాలో గుడారి సమితి పెండిలి పంచాయతీలోని పొంచుగుడ గ్రామానికి చెందిన ఒక నిండు గర్భిణిని ఆస్పత్రిలో చేర్చేందుకు గ్రామస్తులు నదిని దాటించుకొని తీసుకెళ్లిన దుస్థితిపై వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు జిల్లా ఆరోగ్య శాఖ స్పందించింది. ఈ మేరకు శనివారం పొంచుగుడ గ్రామానికి ఒక వైద్య బృందం తరలివెళ్లింది. డాక్టర్ స్వాగత్ స్వయి ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకున్న వైద్య బృందం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించింది. ముఖ్యంగా గ్రామంలో ఉన్న గర్భిణిలను పరీక్షించి వారికి అవసరమయ్యే మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. తరచూ తమ వైద్య బృందం గ్రామానికి వచ్చి వైద్య సౌకర్యాలను అందిస్తుందని డాక్టర్ స్వయి తెలిపారు.


మైనర్ బాలిక దహనం కేసులో కొత్త మలుపు



పోలీసులకు చిక్కిన కీలక సామగ్రి

భువనేశ్వర్: పూరీ జిల్లా నిమాపడా నియోజకవర్గం బొలొంగా ప్రాంతంలో మైనర్ బాలికపై కిరోసిన్ పోసి సజీవ దహనం విఫలయత్నం ఘటనలో కీలకమైన ఆధారాలు లభ్యం కాక దర్యాప్తు బృందం తలకిందులు అవుతోంది. అయితే ఈ పరిస్థితుల్లో శనివారం ఊహాతీతంగా కీలకమైన ఆధారాలు పోలీసుల చేతికి చిక్కినట్లు సమాచారం. మంటల్లో చిక్కుకున్న బాలికను మొదట రక్షించిన వ్యక్తి ఇంట్లో ఈ కీలక సామగ్రి లభించడం సరికొత్త మలుపుగా భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో కిరోసిన్, కాలిపోయిన దుస్తులు, వేలిముద్రలు ఉన్న కొన్ని వస్తువులు దొరికాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు కోసం ఆ సామగ్రిని రాష్ట్ర ఫోరెన్సిక్ ప్రయోగశాలకు తరలించారు. ఈ కేసు ప్రాథమిక విచారణ చేపట్టిన బొలొంగా పోలీసుస్టేషన్ నుంచి జిల్లా ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు.

అత్తింటివారు హత్య చేశారని ఫిర్యాదు



జయపురం: అత్తగారి ఇంట్లో తమ కుమార్తెను హత్య చేశారని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ మెయిన్ రోడ్డులో నివాసముంటున్న మంజులా నాయిక్ కుమార్తె వర్షా నాయిక్(20) 2023 సెప్టెంబర్ 16వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. బొయిపరిగుడ హనుమాన్ నగర్‌లోని ధన టక్రి కుమారుడు దుఖి శ్యామ్ టక్రిను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటినుంచి వారు కలిసి నివసిస్తున్నారు. అయితే శుక్రవారం వర్ష నాయిక్ అత్తగారింట్లో ఉరిపోసుకుందని అత్తింట్లో వారు వెల్లడించారు. అయితే తన కుమార్తెను హత్య చేశారని మృతురాలి తల్లి ఆరోపించింది. గత నాలుగు నెలలుగా తన కుమార్తెను కొడుతున్నారని ఫిర్యాదులో పేర్కొంది. తన కుమార్తెను ఆమె భర్త దుఖి శ్యామ్ హత్య చేశాడని, హంతకుడిని అరెస్టు చేసి తగిన శిక్ష విధించాలని కోరింది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

ఉప్పొంగుతున్న నదులు



భారీ నీటిమట్టంతో ప్రవహిస్తున్న జలకా నది



భద్రక్ జిల్లా అఖువాపాదా తీరంలో పొంగిపొర్లుతున్న వైతరణి నది

- రాష్ట్రానికి వరద బెడద
- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- అంతకంతకూ పెరుగుతున్న నీటిమట్టం
- అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం

భువనేశ్వర్:

రాష్ట్రంలో వరదలతో నదులు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల ప్రమాద సంకేతం దాటి తీర ప్రాంతాల్లో కట్టలను బలహీనపరుస్తున్నాయి. నదీ తీర ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ప్రాణహాని జరగకుండా సమగ్ర యంత్రాంగం చురుకుగా పని చేస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ పేర్కొంది. ప్రధానంగా సువర్ణ రేఖ, వైతరణి, జలకా నదుల్లో వరద ఉద్ధృతి విపరీతంగా కొనసాగుతోంది. ఈ నదుల్లో నీటిమట్టం పలు తీర ప్రాంతాల్లో గరిష్ఠ పరిమితికి మించి ఉంది. వైతరణి నది ఆనందపూర్, అఖుపాదా, జలకా నది మథాని తీరం, సువర్ణ రేఖ నది జంసోలా ఘాట్, రాజ్‌ఘాట్ తీర ప్రాంతాల్లో గరిష్ఠ పరిమితిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల అంచనా.

ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధం

రాష్ట్రంలో వరద ముంపు పరిస్థితి తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితి నివారణ కోసం ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. నదుల్లో వరద పరిస్థితిని నియంత్రించడానికి ప్రభుత్వం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి కార్యాచరణ ఖరారు చేసింది. అల్ప పీడనం కారణంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో వివిధ నదుల నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. నదుల్లో నీటిమట్టం పెరుగుతున్నందున వరద ముంపు పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాఢి శనివారం విలేకరులకు తెలియజేశారు. అవసరమైతే లోతట్టు వరద తాకిడి ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేసి సురక్షిత ప్రదేశాలకు తరలిస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బాలాసోర్ జిల్లాలో 4 మండలాలు మళ్లీ ప్రభావితం అవుతాయని భావిస్తున్నారు. వాటిలో బలియాపాల్, భొగొరాయ్, బొస్తా, జలేశ్వర్ ఉన్నాయి.

నిరంతర నిఘా

ఉప్పొంగుతున్న నదీతీర ప్రాంతాల్లో పరిస్థితులపై అనుబంధ యంత్రాంగం నిరంతర నిఘా పెడుతోంది. రాష్ట్ర వరద విభాగం రాత్రింబవళ్లు చురుకుగా పని చేస్తుందని చంద్రశేఖర్ పాఢి తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లకు అప్రమత్తం చేశారు. జాజ్‌పూర్, భద్రక్ – బాలసోర్ జిల్లా కలెక్టర్లు నదీతీర ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, క్షేత్రస్థాయిలో అనుబంధ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సువర్ణరేఖ, బుఢాబొలంగ్, మహానది, బ్రాహ్మణి, వైతరణి వ్యవస్థ నుంచి చీఫ్ ఇంజినీర్లు, బేసిన్ మేనేజర్లు జిల్లా యంత్రాంగంతో సమన్వయ కార్యాచరణను పర్యవేక్షిస్తున్నారు. భువనేశ్వర్ నుంచి ఇద్దరు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లను ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. ఈ ఉన్నతాధికారులు సువర్ణరేఖ బేసిన్, వైతరణి బేసిన్ పరిధిలో వారు క్షేత్ర స్థాయిలో వరద నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఈ రెండు నదుల్లో నీటి మట్టాలు ప్రమాద స్థాయిని దాటిన తర్వాత ఈ అధికారులను తరలించారు.

వైతరణి ఉగ్రరూపం

భద్రక్ జిల్లా అఖుపాడా తీరంలో వైతరణి ఉగ్రరూపం దాల్చుతోంది. ఈ మేరకు కలెక్టర్ వరద హెచ్చరికను జారీ చేశారు. చాంద్‌బాలి, ధామ్‌నగర్‌లు తీవ్రంగా, భొండారి, పాఖొరి ప్రాంతాలు పాక్షికంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మయూర్‌భంజ్ జిల్లాలో రాసగోవింద్‌పూర్, మోర్డా, ఘులియాపడా, చిత్రాడ్ మొదలైన ప్రాంతాల్లో ఎగువ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా జలకా నది నీటిమట్టం పెరుగుతోంది. ఇటీవల ఈ ప్రాంతం వరదలకు గురై వందలాది హెక్టార్లలోని వరి పొలాలు నాశనమయ్యాయి. ఈ పరిస్థితి దిగజారకుంటే బొస్తా మండలంలో 8 పంచాయతీలు, సదర్ మండలంలో 2 పంచాయతీలు ప్రభావితం అవుతాయని భయపడుతున్నారు. వివిధ ప్రదేశాల్లో కరకట్టలు బలహీనంగా ఉండడంతో నదీతీర ప్రాంత ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు.



ముండలి తీరంలో మహానది నీటిమట్టం



బాలాసోర్ జిల్లా బొస్తా పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చిన జలకా నది వరద నీరు



జలదిగ్బంధంలో సుందరగడ్ రాణి బగీచా

మలేరియా విజృంభణ

- ఆశ్రమ పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు చికిత్స



కుంబారదాముని ఆశ్రమ పాఠశాల

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని బిసంకటక్ సమితి కుంబారి దాముని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులకు మలేరియా సోకింది. ఈ వ్యాధి బారినపడిన విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. మలేరియా వ్యాధి సోకినవారిలో నలుగురికి జాండిస్ కూడా ఉన్నట్లు రక్త నమూనా పరీక్షల అనంతరం నిర్ధారణ అయ్యింది. మలేరియా సోకినవారిలో ఆశ్రమ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విశ్వనాథ్ నుండ్రుక, మూడో తరగతి చదువుతున్న రాజా సరక, నాలుగో తరగతి చదువుతున్న డొంబురు భత్రియా, ఐదో తరగతి చదువుతున్న చందన్ హుయికలు ఉన్నట్లు గుర్తించారు.

మెరుగైన చికిత్సకు తరలింపు

జ్వరంతో బాధపడుతున్నవారిని రెండు రోజుల క్రితం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు తరలించారు. జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు వారి రక్త నమూనాలను సేకరించి పరీక్షించగా విద్యార్థులకు మలేరియాతో పాటు జాండిస్ సోకినట్లు వ్యాధి నిర్ధారణ అయ్యింది. అనంతరం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే వారిని మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. అయితే బరంపురంలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఇదిలాఉండగా ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విషయమై బిసంకటక్ సమితి సంక్షేమ శాఖ అధికారి శుభ్రప్రద సామల్ దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగుందని చెప్పారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న మిగతా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు శుక్రవారం ఒక వైద్య బృందం వెళ్లిందని వివరించారు. పాఠశాలలో కలుషితమైన నీటిని తాగడం వల్లే విద్యార్థులు వ్యాధుల బారిన పడ్డారని సమాచారం.

ఏటీఎం చోరీకి యత్నం



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

- ముగ్గురు అరెస్టు

రాయగడ: ఏటీఎంను చోరీ చేసేందుకు సిద్ధమవుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలోని మునిగుడ సమితి అంబోదల సమీపంలో ఇందిరాపాడ దాబా వద్ద బాలిజోడికి వెళ్లే రహదారిలో నిందితులను పోలీసులు పట్టుకున్నారు. అరెస్టైనవారిలో అంబోదల పోలీస్‌స్టేషన్ పరిధి బాలిజొడి గ్రామానికి చెందిన అమ్మిక, సంకులిపాదొరొ గ్రామానికి చెందిన లాకిరామ్ కులసిక, బిసంబర్ ప్రస్కాలు ఉన్నారు. వీరి నుంచి ఒక గునపాం, కత్తి, ఫ్లాస్, రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. బిసంకటక్ ఎస్‌డీపీవో సంతోషిణి ఓరం తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి పోలీసులు ఎప్పటిలాగే రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారి వద్దకు వెళ్లేసరికి వారు చూసి పరిగెత్తారు. దీంతో పోలీసులు అనుమానించి వారిని వెంబడించి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిందితులను విచారించగా అంబొదల ప్రాంతంలోని ఒక ఏటీఎంలో నగదును దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్నామని అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

తప్పిన పెను ప్రమాదం



సహాయక చర్యల్లో అగ్నిమాపక దళం

భువనేశ్వర్: వైతరణి నదికి ఆకస్మిక వరద ఉద్ధృతితో జల దిగ్బంధంలో చిక్కుకున్న మహిళలు అదృష్టవశాత్తు ప్రాణాలతో ఒడ్డుకు చేరగలిగారు. ఆనంద్‌పూర్ తీరం అంబుగాంవ్ జాతర బహిరంగ స్థలంలో మేకలను కాస్తుండగా నది వరద నీరు ముంచెత్తింది. ఈ ముంపులో 5 మంది మహిళా మేకల కాపర్లు, 50 మేకలు వరద వలయంలో చిక్కుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తతో సకాలంలో స్పందించి చేయూతనిచ్చి సురక్షితంగా వీరందరినీ ఒడ్డుకు చేర్చారు.

మట్టి గుడిసెలోనే అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారులు

జయపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల ఉన్నతికి కృషి చేస్తున్నట్లు చేస్తున్న ప్రకటనలు వాస్తవానికి దూరంగా ఉంటున్నాయి. అందుకు బొయిపరిగుడ సమితి దొబాగుడ పంచాయతీలోని తెంతులిపాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉదాహరణగా చూపించవచ్చు. ఇక్కడ గత 25 ఏళ్లుగా మట్టి గుడిసెలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించారు. ఈ కేంద్రంపై సింధూరిముండి, నువాగుడ, తెంతులిపాడ గ్రామాల పిల్లలు ఆధారపడి ఉంటున్నారు. ఇక్కడి కేంద్రానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ అంగన్‌వాడీ నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యా బోధన జరుగుతోందని అంగన్‌వాడీ కార్యకర్త బనిగ రథ్ తెలియజేశారు. అయితే సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నిర్వహణ కష్టమవుతోందని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై వరాల జల్లు

- రూ.10 లక్షల జీవిత బీమా
- పీఎంఏవైలో ఇంటి నిర్మాణం
- జాతీయ సదస్సులో ప్రకటించిన సీఎం మోహన్‌చరణ్



సత్కారం పొందిన పారిశుద్ధ్య కార్మికులతో సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: నగరాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మోహన్‌చరణ్ మాఝి పేర్కొన్నారు. స్థానిక లోక్‌సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభమైన 2 రోజుల జాతీయ వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన ప్రభుత్వ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతీ సంవత్సరం జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గరిమా యోజన పారిశుద్ధ్య కార్మికుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే కాకుండా వారికి సాధికారత కల్పిస్తోందని పేర్కొన్నారు. గరిమా యోజన కింద రాష్ట్రంలోని 115 పట్టణ నగర ప్రాంతాల్లో 10,000 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులను నైపుణ్యం మరియు అత్యంత నైపుణ్యం కలిగిన కార్మికులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

కార్మికులకు వరాలు

ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల గౌరవ ప్రతిష్టలకు పట్టం గట్టే రీతిలో ముఖ్యమంత్రి పలు ఆకర్షణీయమైన ప్రయోజనాలు ప్రకటించారు. మురుగు నీటి కాలువలు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పారిశుద్ధ్య కార్మికులకు రూ.10 లక్షల జీవిత బీమా, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.30 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రథమ శ్రేణి పారిశుద్ధ్య కార్మికులకు స్మార్టు మొబైల్ ఫోన్ల సదుపాయం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణ) కింద ఇళ్ల సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిఏటా ఆగస్టు 15 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల ఐఈసీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం వర్క్‌షాప్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారిశుద్ధ్యానికి సంబంధించిన ఆధునిక భద్రతా పరికరాల ప్రదర్శనను ప్రారంభించి సందర్శించారు. అలాగే పలువురు పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి విభాగం మంత్రి డాక్టర్ కృష్ణచంద్ర మహాపాత్రో మాట్లాడుతూ స్వచ్ఛమైన నగరాలు మరియు గ్రామాల ఆవిష్కరణలో పారిశుద్ధ్య కార్మికులు గుర్తింపు నోచుకోని హీరోలుగా అభివర్ణించారు. వారు నిరంతరం మానవ సమాజానికి అత్యంత అవసరమైన సేవలను అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారు తరచూ పలు ప్రమాదకర పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికుల హక్కులు, భద్రత మరియు గౌరవాన్ని నిర్ధారించడం మన బాధ్యతగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహుజా, కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ అన్నారు. పారిశుద్ధ్య రంగంలో ఒడిశా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గరిమా పథకాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని నగర నిర్వహణ కేంద్రం వ్యవస్థాపక డైరెక్టర్ మాన్విత బరాడి అన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం మోహన్‌చరణ్

క్లుప్తంగా

పూల దుకాణం దగ్ధం



దగ్ధమవుతున్న దుకాణం

భువనేశ్వర్: స్థానిక కాంగ్రెస్ భవన్ సమీపంలోని వెండింగ్ జోన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పూల దుకాణం దగ్ధమైంది. పూల దుకాణం నుంచి మరో 2 దుకాణాలకు మంటలు వ్యాపించాయి. షట్టర్లను కత్తిరించిన తర్వాత మంటలు చెలరేగాయి, షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ దుర్ఘటన సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

సెంచూరియన్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో శనివారం రక్తదాన శిబిరాన్ని రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్గిల్ విజయ దివాస్ పురస్కరించుకుని వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో అనేక మంది విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం అనేక ప్రాణాలు ఆపద సమయంలో కాపాడడానికి ఉపయోగపడుతుందని సీనియర్ రెడ్‌క్రాస్ కౌన్సిలర్ డా.సుశాంత కుమార్ పట్నాయిక్ వివరించారు. మొత్తంగా 41 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు బ్లడ్ బ్యాంక్ సీనియర్ ఫార్మసిస్టు ఖగేశ్వర బెహరా తెలిపారు. శిబిరంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.సంధ్య, అసోసియేట్ డీన్ డా.ప్రజ్ఞాపాణి, డీన్ (విద్యార్థుల వ్యవహారాలు) డా.రితీష్ కుమార్ తదితరులు సహకరించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గుసాని సమితి ఉప్పలాడలో జిల్లా ముఖ్య శిక్షణాధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ టాగోర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై జిల్లాస్థాయి క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలో 14 విద్యాలయాల నుంచి 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 14 మంది జూనియర్ రెడ్‌క్రాస్ కౌన్సిలర్లు, జిల్లా నోడల్ అధికారి (హెచ్ఐవీ) డాక్టర్ నారాయణ దాస్, టాగోర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వై.ధర్మారావు, ఐసీటీసీ సూపర్‌వైజర్ శక్తిప్రసాద్ పట్నాయిక్, జూనియర్ రెడ్‌క్రాస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే నర్సింగ్ పర్యటన



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నర్సింగ్

మల్కన్‌గిరి: జిల్లాలోని పోటేరు, మల్కన్‌గిరి తదితర ప్రాంతాల్లో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, పోటేరు ఆదివాసీ సహకర సంఘం సభ్యులు విస్తృతంగా పర్యటించారు. దీనిలో భాగంగా ఖరీఫ్ సీజన్ 2025 – 26 రైతు నమోదు సమీక్ష చేశారు. ఒడిశా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ నమోదు జూలై 19 నుంచి ఆగస్టు 20 వరకు జరుగుతుంది. నర్సింగ్ మడ్కమి రైతులు, అధికారులతో చర్చించి సబ్సిడీ సాకర్యాల సులభ లభ్యతపై దృష్టి. ఆయనతో పాటు అధికారులు, నాయకులు ఉన్నారు.

దుండగుల ఆగడాలు

జయపురం: అప్పర్ కొలాబ్ సాగునీటి కెనాల్ రోడ్డులో మరలా దుండగుల ఆగడాలు పెరుగుతున్నాయి. ఒక యువకుడిని అడ్డగించి అతని వద్దనున్న రూ.23 వేల నగదు, సెల్‌ఫోన్ దోచుకుపోయారు. ఈ విషయంపై బాధితుడు మోహిత్ కుమార్ పాత్రో ఫిర్యాదు చేసినట్లు పోలీసుల అధికారి ఉల్లాసచంద్ర రౌత్ వెల్లడించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పనిచేసే మోహిత్ కుమార్ పాత్రో ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. అయితే అతడిని ధనపూర్ శాఖా కెనాల్ రోడ్డులో యమునగుడ వంతెన వద్ద ముగ్గురు దుండగులు అడ్డుకున్నారు. వారు మోహిత్‌ని భయపెట్టి డబ్బు, సెల్‌ఫోన్‌ను బలవంతంగా దోచుకుపోయారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పోలీసు అధికారి వెల్లడించారు. తప్పకుండా దుండగులను అరెస్టు చేస్తామని వెల్లడించారు. ఈ కేసుని ఎస్ఐ సిద్దార్ధ కుమార్ బెహర దర్యాప్తు చేస్తున్నారు. కెనాల్ రోడ్డులో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. అయితే కొన్నేళ్లుగా పోలీసులు తీసుకున్న చర్యల కారణంగా కొంతకాలంగా సద్దుమణిగాయి. అయితే మరలా దొంగతనాలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

సీఎస్‌ఆర్‌తో ప్రయోజనాత్మక పనులు చేపట్టాలి



నాల్కో కార్యాలయంలో మాట్లాడుతున్న గవర్నర్ కంభంపాటి హరిబాబు

- గవర్నర్ కంభంపాటి హరిబాబు

భువనేశ్వర్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమం కింద ప్రయోజనాత్మక పనులు చేపట్టాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి స్థానిక నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో) ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యాలయం శనివారం సందర్శించిన సందర్భంగా నాల్కో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. నాల్కో తన సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థల్లో ఆరోగ్య పరీక్షలు మరియు అనుబంధ పోష్టికాహార కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల మరియు కళాశాల విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాలికలు మరియు మహిళల్లో తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలు మరియు పిల్లల్లో పెరుగుతున్న దృష్టి లోపం వంటి సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈ విషయమై స్థానిక నాల్కో భవన్‌లో కంపెనీ ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్, డైరెక్టర్లు మరియు సీనియర్ అధికారులతో గవర్నర్ సంభాషించారు. రక్తదాన కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం కొరవడుతోందన్నారు. వారిలో తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిల కారణంగా రక్తదానం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. అందువలన బీట్‌రూట్ రసం, బెల్లం చిక్కీ వంటి సరళమైన, పౌష్టిక పదార్థాలను విద్యార్థుల రోజువారీ ఆహారంలో చేర్చాలని సూచించారు. పాఠశాలల్లో ప్రాథమిక కంటి చూపు పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించడంతో విద్యార్థుల్లో కంటిచూపు లోపాలను తరగతి గదిలోనే ముందస్తుగా గుర్తించడం సాధ్యమవుతుందన్నారు. ప్రాథమిక పరీక్షల ఆధారంగా తమ పిల్లలకు సకాలంలో వైద్య సహాయం సంప్రదింపుల కోసం వారి తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. నాల్కో సౌర శక్తి వినియోగాన్ని విస్తరించాలని కోరారు. అనంతరం ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచారం కింద ఒక మొక్కను నాటారు.

ఆరోగ్యశ్రీ సేవలు మెరుగుపరచాలి



ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నరసన్నపేట: ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలను మెరుగుపరచాలని, రోగులకు మరింత బాధ్యతగా సేవలు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నరసన్నపేట ఏరియా ఆస్పత్రిని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఆరోగ్యశ్రీలో ఎందుకు ఎక్కువగా ఆపరేషన్లు చేయడం లేదని వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. అన్ని కేసులను ఆరోగ్యశ్రీలో చేర్చాలని, ఈ మేరకు వైద్యులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని డీసీహెచ్ కళ్యాణ్‌బాబు వివరించారు. వైద్యులు రెండు పూటలా ఆసుపత్రిలో సేవలు అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు ఆసుపత్రి నూతన భవనాలు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఇంజినీర్లను ప్రశ్నించారు. పనులు వేగవంతం చేయాలని ఎన్నిసార్లు చెప్పినా కాంట్రాక్టర్ స్పందించడం లేదని ఏపీఎంఎస్ఐడీ ఈఈ సత్యప్రభాకర్ కలెక్టర్‌కు వివరించారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించినా పనులు పూర్తి చేయడం లేదని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏఓ ఏపీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ

పర్లాకిమిడి: ఒడిశాకు చెందిన విద్యార్థులకు ఫార్మా, హెల్త్‌కేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలియజేశారు. ప్లస్ త్రీ, ప్లస్‌టు పాస్, ఫెయిలైన విద్యార్థులకు అసోసియేట్ ఫార్మా కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వారికి శిక్షణతో పాటు ఉచితంగా భోజన వసతి సదుపాయాలు, యూనిఫారం, స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 76809 45357, 83311 18019, 79950 13422 లేదా శ్రీకాకుళంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో తమ సంస్థను సంప్రదించాలని కోరారు.

టి.డి.వలసలో వైద్యబృందం పర్యటన

జి.సిగడాం: టంకాల దిగ్గువలస గ్రామంలో జ్వరాలు పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాలు, రక్త పరీక్షలు కొనసాగిస్తామని వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు తెలిపారు. జ్వరాలు తగ్గుముఖం పట్టినప్పటికీ కీళ్ల నొప్పులు, కాళ్ల పొంగులు ఉండటంతో పాటు అక్కడక్కడా జ్వరాలు పీడితులు ఉన్న నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రాస్పత్రి నుంచి రాపిడ్ ప్రత్యేక వైద్య బృందం ప్రతినిధులు టి.మనోజ్, బి.రాధిక, పనిత్ రాహుల్, రణధీర్ రెడ్డి శనివారం గ్రామాన్ని సందర్శించారు. జ్వరపీడితుల ఇళ్లకు వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. పారిశుద్ధ్య లోపం కారణంగా దోమలు, ఈగల బెడద ఎక్కువైతే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు విజృంభిస్తాయన్నారు.

బీల థర్మల్ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

- హైకోర్టులో రిట్ దాఖలు



మాట్లాడుతున్న బీల ఉద్యమకారులు, న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చిత్తడి నేలల ప్రాంతమైన సోంపేట మండలం బీల వద్ద థర్మల్ విద్యుత్ కేంద్రం పెట్టాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ సాగిన ఉద్యమంలో అప్పటి ప్రభుత్వం ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో రిట్ దాఖలు చేశామని బీసీ న్యాయవాదుల సంఘం, బీల ఉద్యమకారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీల వద్ద థర్మల్ ప్లాంట్ వద్దంటూ ఉద్యమం చేపట్టిన వారిపై 2010 జూలై 14న నాటి ప్రభుత్వం కాల్పులు జరిపి ముగ్గురు మృతికి, పలువురు గాయాలు పాలవడానికి కారణమై తిరిగి ఉద్యమకారులపైనే కేసులు బనాయించిందని తెలిపారు. 14 ఏళ్లుగా వారిని కోర్టుల చుట్టూ తిప్పుతున్న వైనాన్ని వ్యతిరేకిస్తూ ఈ కేసులో ప్రథమ ముద్దాయి బీన ఢిల్లీ రావు మిగతా 23 మంది ముద్దాయిలతో కలిసి ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది చౌదరి లక్ష్మణరావు ద్వారా ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమా మహేశ్వరరావు సహకారంతో హైకోర్టులో న్యాయవాది కరుకోల సింహాచలం రిట్ పిటిషన్(28409/2025) దాఖలు చేశారన్నారు. ప్రతివాదులుగా ఉన్న హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, శ్రీకాకుళం ఎస్పీ మిగిలిన ఏడుగురు పోలీసు అధికారులకు నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు. కేసుల వల్ల చాలా మంది యువకులు వీసాలు, పాస్ పోర్టులు రాక ఉపాధి కోసం విదేశాలకు వెళ్లలేక, స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

టెక్కలి: బీసీలు ఐకమత్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ రేవు శ్రీనివాస్ అన్నారు. శనివారం టెక్కలిలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు వనమాన శ్రీనివాసరావు, కార్యదర్శి దంతిన అప్పలాచారి ఆధ్వర్యంలో జిల్లా సంఘం నియామకాలు చేపట్టారు. అధ్యక్షుడిగా కిల్లి అప్పారావు, ఉపాధ్యక్షులుగా సానపల బాల కృష్ణ, శ్రీరామ్, మహేశ్వరరావు, ఇతర విభాగాల్లో టి.సునీత, కె.ఆదినారాయణ, ఎస్.హరి, టి.కోటయ్య తదితరులను నియమించారు.

కార్గిల్ వీరులు చిరస్మరణీయులు



మాజీ ఎయిర్ మార్షల్ రామారావును సత్కరిస్తున్న కాలనీ వాసులు

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని కార్గిల్ పార్కులో శనివారం కార్గిల్ విజయదివాస్ నిర్వహించారు. వీర జవాను విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఏరోనాట్ విశ్రాంత మార్షల్ వారెంట్ ఆఫీసర్ రఘుపాత్రుని రామారావు (రమేష్)ను కాలనీసభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు కార్గిల్ యుద్ధ అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గివిడి వాసు, మందుల మోహనరావు, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెట్ల నుంచి జారిపడి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బాకెర్ సాహెబ్‌పేటకు చెందిన ఓ వ్యక్తి శనివారం మెట్ల నుంచి జారిపడి మృతిచెందాడని సీఐ ఈశ్వరరావు తెలిపారు. గుజ్జల రామయ్య (51) వెల్డింగ్ షాపులో పనిచేస్తుండేవాడు. శుక్రవారం ఉదయం టిఫిన్ తిన్నాక మేడపైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా పట్టుతప్పి పడిపోయాడు. తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. ఆ సమయంలో భార్య తాను పనిచేసే షాపింగ్ మాల్‌కు వెళ్లిపోవడంతో పక్కింటివాళ్లు వచ్చి చూశారు. వారిచ్చిన సమాచారంతో భార్య వచ్చి రామయ్యను ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించింది. రామయ్య చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

శ్మశానవాటిక కప్పేసి క్రీడా మైదానమా?



పనులు అడ్డుకుంటున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు : కొత్తపేట– కొమరల్తాడ గ్రామాల మధ్య అటవీభూముల్లో శ్మశాన వాటిక, చెరువులను కప్పేసి క్రీడా మైదానం చేస్తే సహించేది లేదని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. శ్మశాన వాటికను కప్పేసి ఆట స్థలం చేసేందుకు టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు వారం రోజులుగా ఏకపక్షంగా పనులు చేట్టడంపై మండిపడ్డారు. ఈ మేరకు శనివారం సర్పంచ్ అంబటి శ్రీను ఆధ్వర్యంలో 50 మందికి పైగా గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటకు ఆనుకుని అటవీ భూముల్లో రెండు గ్రామాలకు సంబంధించిన శ్మశాన వాటిక, దానికి ఆనుకుని చాకలి చెరువు, మరో చెరువు ఉన్నాయని, ఉపాధి పనులు సైతం చేపట్టారని చెప్పారు. ఆట స్థలం కోసం శ్మశాన వాటిలో నిర్మించిన దహన వాటిక సైతం కూల్చేయడం తగదన్నారు. అనంతరం ఎంపీడీఓ ఎస్.రమేష్‌నాయుడును కలిసి పనులు నిలిపివేయాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గుంటు బాలకృష్ణ, గీత కామరాజు, ఎస్.నడిపిరాజులు, ఎస్.కృష్ణమయ్య, యోగేశ్వరరావు, వి.కొర్లయ్య ఎం.నారాయణ, గుంటు త్రినాథ్, గీత గణేష్, కారి కొర్లయ్య, గీత ముకుంద, జి.వీరస్వామి, సాధుబాబు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రణస్థలం: లావేరు మండలం రావివలస సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో కోరాడ నరసింహులు(34) అనే వ్యక్తి మృతి చెందాడు. ఇతని స్వగ్రామం రణస్థలం మండలం కోటపాలెం. సిమెంట్ పనులకు వెళ్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరిన నరసింహులు రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈలోగా రావివలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే వార్త చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నరసింహులుకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు సాయినిర్వత్, విశ్వశ్రీ ఉన్నారు. మృతుడి తండ్రి సూరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ఎం.విజయానందకుమార్ తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎరువుల పంపిణీలో గందరగోళం



సంతబొమ్మాళి వ్యవసాయ కార్యాలయాన్ని చుట్టుముట్టిన రైతులు

సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఎరువుల కోసం రైతులు శనివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందు రోజు టోకెన్లు ఇచ్చిన అధికారులు ఆ మరుసటి రోజు ఎరువులు అడిగితే.. ఇప్పుడా టోకెన్లు పనికి రావని ఎరువులు లేవంటూ చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగారు. టోకెన్ ఇచ్చి ఇప్పుడు ఎరువులు లేదంటే కుదరదని, వచ్చిన ఎరువులు ఎక్కడ అమ్మారో, ఎవరికి ఇచ్చావో చెప్పాలని పలువురు రైతులు మండల వ్యవసాయాధికారి రాయల అప్పారావును నిలదీశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బి.హేమసుందరరావు, పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులకు నచ్చజెప్పారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం ప్రకారం రైతుకు ఒక బస్తా ఇస్తామని చెప్పారు. దీంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు.

భూముల రిజిస్ట్రేషన్‌లో భారీగా అవినీతి

- మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ఆరోపణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి కత్తలకవిటి పంచాయతీ డాక్టరు బంజరి గ్రామంలోని పరశురాంపూర్ మౌజాలో 42 ఎకరాల భూమి అమ్మకం వివాదంలో పలువురి హస్తం ఉందని మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఆరోపించారు. స్థానిక ఇరదల వీధిలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ భూములు రియల్ ఎస్టేట్ మాఫియా చేతిలోకి వెళ్లడానికి దాదాపు రూ.10 కోట్లు చేతులు మారాయని ధ్వజమెత్తారు. 35 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో భూస్వామి అప్పయ్య పేరిట ఈ భూములు ఉండేవి. ఆయన మరణాంతరం ఆయన మనవడు మోటూరు సత్యనారాయణకు ఆ భూములు చెందాయి. ప్రస్తుతం మోటూరు చంద్రశేఖర్‌రావు ఆధీనంలో ఉన్న 42 ఎకరాలు కొన్ని కోట్లు విలువ చేస్తాయి. అయితే 20 ఏళ్లుగా ఆదివాసీ, దళితులు, బీపీఎల్ చేతిలో సాగు హక్కు ఉన్న ఈ భూముల పట్టాలు రియల్ ఎస్టేట్ వారి పేరిట మ్యూటేషన్ చేయడంలో ఆర్ఐ, తహసీల్దార్లు, బీజేడీ నాయకులతో పాటు ఇదివరకు ఇక్కడ పనిచేసిన కలెక్టర్ బిజయకుమార్ దాస్ ప్రమేయం ఉందని పేర్కొన్నారు. డాక్టరు బంజరి గ్రామంలో భూవివాదాన్ని సీఎం మోహన్‌చరణ్ మాఝి దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు.

పుష్ప గోవిందం



స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి పుష్ప గోవిందం సేవ నిర్వహించారు. ఆలయ సముదాయంలో సుగంధ భరితంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పలువురు భక్తులు ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు.
– భువనేశ్వర్

మాల్స్‌ను కాంక్రీట్ బాక్స్‌లా నిర్మించవద్దు

- అలాంటి వాటికి ఇకపై అనుమతులు నిరాకరణ
- ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్



షాపింగ్‌మాల్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

శ్రీకాకుళం క్రైమ్: రాష్ట్రవ్యాప్తంగా షాపింగ్‌మాల్స్‌ను కాంక్రీట్ బాక్సులు మాదిరిగా కడుతున్నారని, ప్రమాదం జరిగితే ప్రజలు బయట పడే విధంగా కనీసం ఫైర్ ఎగ్జిట్స్ కూడా లేకుంటా కట్టడం ప్రాథమికంగా తప్పు అని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు.మాల్స్‌లో బ్రీతింగ్ బాల్కనీలు, వాటి గుండా మెట్లు నిర్మిస్తే రక్షణగా నిలుస్తాయన్నారు. ఈ ఏడాది జనవరి 25న శ్రీకాకుళం నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అగ్నిప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. తిరిగి అదే భవనాన్ని యాజమాన్యం పునఃనిర్మించడంతో ఫైర్ సేఫ్టీ అంశాలను పరిశీలించేందుకు డీజీ శనివారం శ్రీకాకుళంలోని మాల్‌కు వచ్చి పరిశీలించారు. సరిగ్గా 10 రోజుల క్రితం ఇరాక్‌లో ఓ మాల్‌లో పని వేళల్లో అగ్ని ప్రమాదం సంభవించి 82 మంది చనిపోవడాన్ని గుర్తు చేశారు. అనంతరం విలేకరులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 25న మాల్‌లో సంభవించిన ప్రమాదంలో మంటలను అదుపు చేసేందుకు లోపలికి వెళ్లేందుకు 6 గంటలు, పూర్తిగా అగ్నికీలలు ఆర్పేందుకు మరో 6 గంటల సమయం పట్టిందన్నారు. ఇకపై కచ్చితంగా నిబంధనలు పాటిస్తేనే స్మోక్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అనంతరం సౌతిండియా షాపింగ్ మాల్ రీజనల్ మేనేజర్ బి.నవీన్‌కుమార్‌కు ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఫైర్ డీజీతో పాటు ఆ విభాగానికి చెందిన విశాఖపట్నం రీజనల్ అధికారి డి.నిరంజన్‌రెడ్డి, జిల్లా అధికారి జడ్డు మోహనరావు, సహాయాధికారి శ్రీనుబాబు, రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సంతోష్‌కుమార్, ఫైర్ సిబ్బంది, షాపింగ్‌మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

యాప్‌ల భారం తగ్గించకపోతే బహిష్కరణే



డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించి పాఠాల బోధనకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు నెలలగా వేతనాలు రాక అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులకు వెంటనే పొజిషన్ ఐడీలు క్రియేట్ చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట సంఘ కోశాధికారి బి.రవికుమార్ అధ్యక్షతన శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ బోధన కాకుండా యాప్‌లకు ప్రాధాన్యమిస్తూ పాఠశాల నిర్వీర్యానికి ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఈ విధానాన్ని వెంటనే మార్చుకోకపోతే ఆగస్టు ఒకటి నుంచి అన్ని యాప్‌లను బహిష్కరిస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. రెండు నెలలగా రాష్ట్రంలో సుమారు 65వేల మందికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు సూర్యప్రకాశరావు, సురేష్, స్వర్ణకుమారి, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్, పొందూరు అప్పారావు, ఎండ ఉమాశంకర్, బాబూరావు, ఉమ భాస్కర్, కోదండ రామయ్య, త్రినాథ్, శ్రీను, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



హాజరైన అథ్లెట్లతో పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి జూనియర్ – సబ్ జూనియర్స్ పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పారా అథ్లెట్లు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. ఇక్కడ ఎంపికైనవారు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. 100 మీటర్లు, 400 మీటర్లు, 1500 మీటర్ల పరుగు, షాట్‌పుట్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో తదితర అంశాల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు టి.రాము, కార్యదర్శి డి.అచ్యుతరావు, స్రవంతి, మోహనరావు, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ కోచ్ శ్రీనివాస్, అథ్లెట్లు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వంగర ఘాట్‌రోడ్డుకు గండి



ప్రమాదకరంగా మారిన ఘాట్‌రోడ్డు

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కేదారిపురం మీదుగా వంగర వెళ్లే ఘాట్‌రోడ్డు కోతకు గురికావడంతో గండి పడింది. దీంతో వంగర మీదుగా కేసర వరకు నడిపే ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను సైతం నిలిపివేశారు. ఏడాది కిందట కూడా ఇదే ప్రాంతంలో గండి పడడంతో సీసీ రోడ్డు నిర్మించి, ఓ వైపు రక్షణ గోడ నిర్మించారు. అయినప్పటికీ మళ్లీ అదే ప్రాంతంలో గండి పడడంతో వంగర, కేసర, డోలుకోన, సంధిగూడ గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కారుణ్య నియామకం



సీహెచ్ తేజకు నియామకపత్రం అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేసి అనారోగ్య కారణాల వల్ల ఉద్యోగ విరమణ చేసి అనంతరం మృతి చెందిన సీహెచ్ ఈశ్వరరావు కుమారుడు సీహెచ్ తేజను జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం స్థానిక పోలీస్ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, డీపీఓ సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, జూనియర్ సహాయకురాలు చాముండేశ్వరి, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బుచ్చన్నపేట గ్రామానికి చెందిన బొంతు భాస్కరరావు అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండని ఓ బాలికను ప్రేమ పేరుతో శారీరకంగా వంచించి పెళ్లి చేసుకుంటానని చెప్పి తల్లిదండ్రుల సంరక్షణ నుంచి విజయవాడ తీసుకువెళ్లిపోయాడన్నారు. బాధితుల ఫిర్యాదుతో సదరు భాస్కరరావుపై పోక్సోతో పాటు కిడ్నాప్ కేసు కూడా నమోదు చేశామని తెలిపారు.

గోముఖి నదిలోకి నీరు విడుదల

మక్కువ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని శంబర గ్రామ సమీపంలో ఉన్న గోముఖి రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరుతుండడంతో శనివారం సుమారు వంద క్యూసెక్కుల నీటిని రిజర్వాయర్ నుంచి గోముఖి నదిలోకి విడిచి పెట్టారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ జేఈ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. వరదలు ఎక్కువైతే నదిలోకి మరింత నీరు విడిచిపెడతామని చెప్పారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: అరుకు – సిమిలిగూడ మధ్య గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఐదు అడుగుల ఆరంగుళాల పొడవుండి తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. షర్ట్‌పై ముదురు ఆకుపచ్చ జర్కిన్ ధరించాడని, దానిపై కోడ్ అనే ఇంగ్లిష్ అక్షరాలున్నాయని చెప్పారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 94906 17089, 63013 65605 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ అశోక్ ఉన్నారు.

విద్యార్థుల ప్రాణాలు కాపాడండి



కలెక్టర్ కార్యాలయం ఎదురు నిరసన దీక్షలు చేస్తున్న ఆదివాసీ ఆరోగ్య కార్యకర్తలు

పార్వతీపురం రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో గిరిజన విద్యార్థులకు గతంలో వైద్య సేవలు అందించిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని విధుల్లోకి తీసుకుని గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, పీడీఎస్‌ఓ జిల్లా కన్వీనర్ కొండతామర సోమేశ్, కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మండలాధ్యక్షుడు తీళ్ల గౌరీశంకరరావు డిమాండ్‌చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న ఆరో రోజు నిరసన దీక్షలో వారికి మద్దతుగా పాల్గొన్నారు. గిరిజన విద్యార్థులకు వైద్యసేవలందించేందుకు ఏఎన్‌ఎంలను నియమించాలన్నారు. నిరసన దీక్షల్లో రాజేశ్వరి, చిన్నమ్మి, స్వాతి, గౌరీశ్వరి, లక్ష్మి, నందిని, గౌరమ్మ, రమణమ్మ, చంద్రకళ, సుజాత, అరుణ, నాగలక్ష్మి, సుజాత, లలిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులంటే అంత అలుసా..

- అంగన్‌వాడీ చిన్నారులకు ఇంతవరకు పంపిణీ చేయని ప్రీ స్కూల్ కిట్లు
- అందని ఆటపాటలతో కూడిన విద్య



విజయనగరంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపిస్తే ఆటపాటలతో కూడిన విద్య అందుతుందని తల్లిదండ్రుల నమ్మకం. అయితే ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు అవసరమైన వస్తువులతో కూడిన ప్రీ స్కూల్ కిట్లను ఇంతవరకు కూటమి ప్రభుత్వం సరఫరా చేయలేదు. చిన్నారులంటే మరీ ఇంత అలుసా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి సర్కారు గొప్పలు చెప్పుకుంటోంది. కాని పిల్లల చదువుకు అవసరమైన స్కూల్ కిట్లను మాత్రం ఇంతవరకు సరఫరా చేయలేదు. అసలే అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య అంతంత మాత్రంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో స్కూల్ కిట్లు అందివ్వకపోవడం.. ఆటపాటలతో కూడిన విద్య అందకపోతే కేంద్రాల మనుగడే ప్రశ్నార్థమవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

11 ప్రాజెక్టులు..

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు 11 ఉన్నాయి. వీటి పరిధిలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. మెయిన్ కేంద్రాలు 2,206 కాగా 293 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ఆయా కేంద్రాల పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 42,161 మంది.. మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 21,543 మంది ఉన్నారు.

సరఫరా మాటేమిటి..?

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రీ స్కూల్ కిట్లు (ఆట వస్తువులతో కూడిన మెటీరియల్) అందించాలి. కార్యకర్తలు వీటితోనే చిన్నారులకు బోధన అందిస్తారు. కిట్‌లో బిల్డింగ్ బ్లాక్స్, బాల్స్, బ్యాట్, రింగ్స్, బొమ్మలు, అక్షరాలతో కూడిన కార్డులు, స్లేట్స్ ఉంటాయి. వీటిని చిన్నారులకు చూపిస్తూ ఆహ్లాదకర వాతావరణంలో బోధన అందించాల్సి ఉంది. ఇంతటి ఉపయోగం ఉన్న కిట్లను కూటమి సర్కారు పంపిణీ చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇంకా రాలేదు..

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన ప్రీ స్కూల్ కిట్లు ఇంకా రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వచ్చిన వెంటనే కేంద్రాలకు పంపిణీ చేస్తాం.
– టి. విమలారాణి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసీడీఎస్

తల్లి సంవత్సరీకానికి వెళ్తూ కుమార్తె మృతి

- ద్విచక్ర వాహనంలో చీర చిక్కుకోవడంతో ప్రమాదం



తవిటమ్మ మృతదేహం

భామిని: తల్లి సంవత్సరీకంలో పాల్గొనేందుకు వెళ్తూ కుమార్తె మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పాలకొండ మండలం అన్నవరం గ్రామానికి చెందిన కొండేటి తవిటమ్మ భర్త జనార్దనరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై ఒడిశాలోని గుణుపూర్‌కు బయలుదేరింది. సరిగ్గా భామిని మండలం ఘనసర వద్దకు వచ్చేసరికి తవిటమ్మ చీర ద్విచక్ర వాహనంలో చిక్కుకుపోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఈ ప్రమాదంలో తవిటమ్మకు తీవ్రగాయాలు కాగా భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను సీతంపేట ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అయితే అప్పటికే తవిటమ్మ (47) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బత్తిలి ఎస్సై జి.అప్పారావు ఆధ్వర్యంలో ఏఎస్సై కొండగొర్రి కాంతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

18 తులాల బంగారం చోరీ



సంఘటనా స్థలం వద్ద బాధితుడితో మాట్లాడుతున్న పోలీసులు

వంగర: మండల పరిధి బాగెంపేట గ్రామంలో ఈ నెల 24వ తేదీ రాత్రి జరిగిన చోరీకి సంబంధించి 18 తులాల బంగారం అపహరణకు గురైందని ఎస్సై షేక్‌శంకర్ తెలిపారు. బాధితుడు పశుమర్తి శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్‌తో కలసి సంఘటనా స్థలాన్ని శనివారం పరిశీలించామన్నారు. ఈ చోరీలో బంగారు ఆభరణాలు పోయినట్లు బాధితుడు తెలియజేశాడని చెప్పారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

- ఐదు రోజుల కిందట అదృశ్యమైన వ్యక్తి.. శవమై కనిపించాడు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు



ప్రమాదంలో మృతి చెందిన గిడిజాల చందు (ఫైల్)



సంఘటనా స్థలంలో విలపిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

తెర్లాం: మోటార్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడిపోవడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఐదు రోజుల కిందట చోటు చేసుకుంది. ఎస్సై సాగర్‌బాబు శనివారం తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కూనాయవలస గ్రామానికి చెందిన గిడిజాల చందు (25) ఈ నెల 22వ తేదీ రాత్రి ఆమిటి నుంచి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తూ రోడ్డుపక్కనున్న కాలువలో పడిపోయాడు. ద్విచక్ర వాహనం కింద ఉండిపోవడం.. కాలువలో నీరు పారుతుండడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య స్వాతి, కుమార్తెలు ధన్యశ్రీ, మౌనిక, తల్లిదండ్రులు శ్రీను, విజయ ఉన్నారు.

కనిపించడం లేదంటూ ఫిర్యాదు..

తన భర్త రెండు రోజులుగా కనిపించడం లేదని చందు భార్య స్వాతి, అతని కుటుంబ సభ్యులు ఈ నెల 24న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు కూడా కనిపించకుండా పోయిన వ్యక్తి ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలిస్తున్నారు. అయితే కనిపించకుండా పోయిన వ్యక్తి చివరకు శవమై కనిపించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చందు కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఆదుకోవాల్సిన కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

దుర్వాసన రావడంతో...

స్థానికంగా ఉండే ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు విరామ సమయంలో రోడ్డు పక్కకు రాగా దుర్వాసన వచ్చింది. దీంతో కాలువలోకి చూడగా.. మోటార్ సైకిల్ కింద ఓ వ్యక్తి పడిపోయి ఉన్నట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై సాగర్‌బాబు సిబ్బందితో సహా సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ముందుగా గుర్తు తెలియని మృతదేహంగా భావించినప్పటికీ, కునాయివలసకు చెందిన వ్యక్తి అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో చందు కుటుంబ సభ్యులు వచ్చి నిర్ధారించడంతో శవపంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

చోరీ చేసిన బైక్‌లపై తిరుగుతూ..

- పోలీసులకు చిక్కిన కేటుగాడు
- ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పాటు నిందితుడు

భోగాపురం: నిర్మానుష్య ప్రాంతాల్లో ఉండే ద్విచక్ర వాహనాలే ఆ కేటుగాడి టార్గెట్.. ఏ బండైనా సరే కనురెప్ప పాటులో చోరీ చేయగలిగే టాలెంట్ వాడి సొంతం.. బైక్ నచ్చితే చాలు అది మాయమైనట్లే...ఏడాది కాలంగా దొంగతనాలు చేయడం..ఎంచక్కా దొంగలించిన బైకులపైనే చక్కెర్లు కొట్టడం అలవాటుగా మార్చుకున్నాడు.. చివరకు పోలీసుల నిఘా నుంచి మాత్రం తప్పించుకోలేకపోయాడు.. దొంగలించిన ద్విచక్ర వాహనంపైనే భోగాపురం రోడ్లపై తిరుగుతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. డీఎస్పీ పి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామానికి చెందిన రాపేటి సూర్యప్రకాష్ గతేడాది పోలిపల్లిలో ద్విచక్రవాహనం దొంగలించాడు. శనివారం అదే బైక్‌పై భోగాపురంలో తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి నంబర్‌ను తనిఖీ చేయగా దొంగలించిన బండిగా గుర్తించారు. తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయగా ఏడాది కాలంలో చేసిన చోరీ వివరాలను చెప్పాడు. పోలిపల్లిలో–1, పూసపాటిరేగలో–1, బొండపల్లిలో–1, పద్మనాభంలో–2 చొప్పున ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్సైలు పాపారావు, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం..

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి. రామ్మోహన్ అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీఎన్‌జీఓ హోమ్‌లో ఎస్‌ఎఫ్‌ఐ 32వ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు టి.అఖిల్ సంఘ లక్ష్యాలతో కూడిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం రామ్మోహన్, తదితరులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఈ మధ్యకాలంలో మరణించిన ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్, తదితరులకు ప్లీనరీ ప్రతినిధులు సంతాపం తెలియజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు సంధ్య, బి.అనిల్, సీహెచ్ సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామ్మోహన్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన విద్యా విధానం వల్ల ప్రభుత్వ విద్యా విధానం అతలాకుతలం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు గతంలో కంటే నేడు మరో రూపంలో దాడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని ఆరోపించారు. అలాగే తల్లికి వందనం పథకంలో లేనిపోని షరతులు పెట్టి ఎక్కువ మంది చిరుద్యోగులను దూరం చేశారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించక పోవడం దారుణమని మండిపడ్డారు.

పలు తీర్మానాలు ఆమోదం..

పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం కేంద్రాల్లో పీజీ సెంటర్లో ఏర్పాటు చేయాలని.. డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని.. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని.. గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని.. సంక్షేమ హాస్టళ్లలో రెగ్యులర్ ఏఎన్‌ఎంలను నియమించాలని చేసిన తీర్మానాలను ఆమోదించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బిడ్డిక అనిల్, కార్యదర్శిగా తిర్లంగి అఖిల్, కోశాధికారి కె.డేవిడ్, ఉపాధ్యక్షులుగా ఎ.గంగారం, సీహెచ్ సింహాచలం, సహాయ కార్యదర్శులుగా సంధ్య, సూర్యతో పాటు మరో పది మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పేకాట ఆడుతూ దొరికిన ‘తమ్ముళ్లు’

- నిందితుల్లో టీడీపీ కౌన్సిలర్
- రూ.63 వేలు స్వాధీనం

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న అడ్డాపుశీల టిడ్కో గృహాల్లో తెలుగుదేశం పార్టీ తమ్ముళ్లు పట్టపగలే పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. అందిన సమాచారం మేరకు పార్వతీపురం రూరల్ పోలీసులు శనివారం సాయంత్రం దాడులు చేసి 14 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.63,470లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో అధిక శాతం మంది టీడీపీకి చెందిన వారే ఉండటం గమనార్హం. పార్వతీపురం పురపాలక సంఘంలోని ఓ వార్డు కౌన్సిలర్, మరికొంత మంది టీడీపీ నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సంతోషి తెలిపారు. మరోవైపు దొరికిన వారిలో చాలా మంది టీడీపీ వారే ఉండటంతో కేసు కాకుండా ఉండేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. పోలీసులపై కూడా కొంత మంది ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. చివరికి విషయం బయటకు రావడంతో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి పెద్ద మొత్తంలో నగదు పట్టుబడినట్లు వినిపిస్తోంది.

దోపిడీ కేసులో నలుగురు నిందితుల అరెస్ట్



పట్టుబడిన ప్రధాన నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న స్కూటర్లు

- ముగ్గురు మైనర్లు కావడంతో జువైనల్ హోమ్‌కు తరలింపు
- పరారీలో మరొక నిందితుడు
- పట్టుబడిన నిందితుడిపై మరో ఎనిమిది కేసులు

విజయనగరం: నగరంలోని చెల్లూరు – గొట్లాం వద్ద ఈ నెల 19న జరిగిన దోపిడీ కేసుకు సంబంధించి విజయనగరం రూరల్ పోలీసులు నలుగురు నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాస్ స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఆయన తెలియజేసిన వివరాల మేరకు.. సాహుగర్ సంతోష్‌కుమార్ అనే వ్యక్తి సరుగుడు కర్రల లోడ్‌తో విశాఖ నుంచి రాయగడ వైపు లారీలో వెళ్తుండగా.. ఐదుగురు నిందితులు చెల్లూరు రోడ్డులో గల భాను దాబా వద్ద లారీని అడ్డగించి సంతోష్‌కుమార్‌పై దాడి చేశారు. అతని వద్ద గల 1200 రూపాయలను అపహరించి పారిపోయారు. అనంతరం బాధితుడు చికిత్స కోసం సమీప ఆస్పత్రికి వెళ్లగా.. ఆస్పత్రి సిబ్బంది రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ సీఐ లక్ష్మణరావు ఆదేశాల మేరకు ఎస్సై అశోక్‌కుమార్ తన బృందంతో గాలించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇందులో ముగ్గురు మైనర్లు కావడంతో వారిని జువైనల్ హోమ్‌కు తరలించారు. ఒకరు పరారీలో ఉండగా.. ప్రధాన నిందితుడు చెన్న అఖిల్ పట్టుబడ్డారు. ఇదిలా ఉంటే ఇతనిపై గతంలో ఎనిమిది దొంగతనం కేసులున్నాయి. ఈ క్రమంలో నిందితుడి నుంచి నాలుగు స్కూటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మణరావు, ఎస్సై అశోక్, తదితరులను డీఎస్పీ అభినందించారు.

ఎరుపెక్కిన బొబ్బిలి..

- విదేశాల్లో తిరగడానికి ఉన్న శ్రద్ధ మణిపూర్ మహిళల పరామర్శకు లేదా?
- మోదీ నిర్ణయాలకు చంద్రబాబు, పవన్‌ల వత్తాసు
- పేదల బతుకులు మారాలి
- సీపీఐ జిల్లా మహాసభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాల నాగేశ్వరరావు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

బొబ్బిలి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోమ్ మినిస్టర్ అమిత్‌షాలకు ఖరీదైన విమానాల్లో విదేశాల్లో తిరగడానికి ఉన్న శ్రద్ధ మనదేశంలో మణిపూర్‌లో దాడులకు గురైన మహిళలను పరామర్శించేందుకు లేకపోవడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక తాండ్ర పాపారాయ జంక్షన్‌లో సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మణిపూర్ మహిళలపై దారుణంగా హింసలు చోటు చేసుకుంటుంటే హోం మంత్రి, ప్రధాని ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో మోదీ, అమిత్‌షా తీసుకున్న నిర్ణయాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వత్తాసు పలుకుతున్నారన్నారు. గతంలో ఇంటింటికీ రేషన్ అందితే ఇప్పుడు షాపుల వద్ద ప్రజలంతా గుమిగూడి లైన్లలో నిలబడి రేషన్ కోసం అవస్థలు పడుతున్నారన్నారు. ఆదివాసీ హక్కుల కోసం సీపీఐ పోరాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం సీపీఐకి అధికారమివ్వాలని పిలుపునిచ్చారు.

కోట చుట్టూ ఉన్న దుకాణదారుల బతుకులు మారాలి..

బొబ్బిలి ఎమ్మెల్యే కోటలో ఉండడం గొప్ప కాదని.. ఆ కోట చుట్టూ ఉన్న దుకాణదారుల బతుకులు మారేలా పాలన సాగించాలని హితవు పలికారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరితే ఆరు నెలల్లో సమస్య పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యే బేబీనాయన ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే పట్టణంలోని వెలమదొరలు వందలాది ఎకరాలు ఆక్రమిస్తుంటే వారిపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. బొబ్బిలి జూట్‌మిల్లు తెరిపిస్తామన్న హామీ కూడా నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టే రోజులు వచ్చాయన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలపై వస్తున్న నిరసనలను అణిచివేసే క్రమంలో సుమారు 750 మంది రైతులు మృతి చెందారన్నారు. అటవీ సంపదను అదానీ, అంబానీలకు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ సృష్టించి మావోలను, ఆదివాసీలను హతమార్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ఆధ్వర్యంలో ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణమంతా ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. అనంతరం తాండ్ర పాపారాయ జంక్షన్ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, జిల్లా నాయకుడు బుగత అశోక్, రాజాం కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠ యాదవ్, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందాపు ప్రసాదరావు, మహిళా సమాఖ్య నాయకులు బాయి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై పటిష్ట నిఘా



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ, రహదారి భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసేవారికి విధిగా శిక్షలు పడేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అటవీ ప్రాంతం, బస్సులు, ఇతర వాహనాల ద్వారా జరిగే మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలో రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. ఏఎస్పీ సురాన అంకిత్ మహావీర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, డీఎస్పీ ఎం.రాంబాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీల మృతికి సంతాపం

రహదారి ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు డీఎస్పీల మృతి పట్ల అధికారులు సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.